ప్రజాశక్తి

శనివారం 8 జులై 2023 5

శ్రీ సత్యసాయి





కలెక్టరేట్ వద్దకు ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

బీమాపై పెదవివిరుపు

◆ కొందరికే వచ్చిందని విపక్షాల విమర్శ ◆ అర్హతలేకున్నా నేతలకు ఇచ్చారన్న ఆరోపణలు





నేడు ముఖ్యమంత్రి రాక

రాష్ట్ర వ్యాప్త రైతు దినోత్సవ కార్యక్రమం శనివారం నాడు కళ్యాణదుర్గం నియోజకవర్గం కేంద్రంలో జరుగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్త పంటలబీమాను పంపిణీని బటన్ నొక్కి ప్రారంభిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 10.2 లక్షల మందికి రూ.1117 కోట్లు బీమా మంజూరైంది. అనంతపురం జిల్లాలో రూ.212.94 కోట్లు మంజూరైంది. బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నేడు ప్రారంభిస్తారు. శనివారం ఉదయం 9.50 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కళ్యాణదుర్గం పట్టణంకు చేరుకుంటారు. అక్కడ మోడల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన సభలో పాల్గొంటారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం పంటలబీమాపై రైతులు పెదవి విరుస్తున్నారు. విపక్షాలు సైతం పంటలబీమాలో రైతులకు అన్యాయం జరిగిందని విమర్శలు చేస్తున్నాయి. పంటనష్టం ఎక్కువగా జరిగితే తక్కువ సహాయం అందుతోందన్న అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రధాన పంట అయిన వేరుశనగ పంటకే నామమాత్రంగా బీమా వచ్చింది. అనంతపురం, సత్యసాయి జిల్లా కలిపి మొత్తం 63 మండలాలుంటే 32 మండలాలకు ఒక్క రూపాయి కూడా పరిహారం వేరుశనగ పంటకు రాలేదు. సత్యసాయి జిల్లాలో 18 మండలాలు, అనంతపురం జిల్లాలో 14 మండలాలకు వేరుశనగకు పరిహారం అందలేదు. ఈ ప్రాంతంలోనూ పంటనష్టం జరిగిందని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. ఇక ఉద్యానవన పంటల్లో అరటి పంట ఎక్కువగా నష్టం జరిగింది. ఈ పంటకూ తగినంత పరిహారం రాలేదన్న విమర్శలున్నాయి. అనంతపురం జిల్లాలో మొత్తం 2.68 లక్షల మంది రైతులున్నారు. దీంతో పరిహారం అందుకుంటున్న రైతులు 1.30 లక్షల మాత్రమే ఉన్నారు. అంటే 50 శాతం మంది రైతులకు పరిహారం అందటం లేదు. జిల్లాకు రూ.212.94 కోట్లు బీమా మంజూరైంది.

25.67 ఎకరాలకు దెబ్బతింటే రూ.3148 పరిహారం

జిల్లాలో డీ.హీరేహళ్ మండలంలో హులికల్లు గ్రామంలో అధికారిక లెక్కల ప్రకారమే 25.67 ఎకరాల్లో టమోట పంట దెబ్బతింది. పరిహారం ఈ గ్రామానికి వచ్చింది కేవలం రూ.3248 మాత్రమే. అధికారిక లెక్కల ప్రకారమే ఎకరం టమోట పంటనష్టం జరిగితే రూ. 80 వేలు పరిహారం రావాల్సి ఉంది. దీని ప్రకారమైతే రూ.20 లక్షలు రావాల్సి ఉంది. కాని పంటలబీమా వచ్చింది రూ.3148 మాత్రమే కావడం గమనార్హం. ఇందులో ఒక రుద్రప్ప అనే రైతుకు వచ్చి బీమా రూ.290 మాత్రమే వచ్చింది.

తాడిపత్రి ఎమ్మెల్యే ఇంట్లో ఒకటిన్నర సంవత్సరం మొక్కలకే బీమా

తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి సంబంధించి ఒకటిన్నర సంవత్సరం చీని చెట్లకు రూ.13.89 లక్షలు బీమా వచ్చిందని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. వాటి వివరాలను మీడియా సమావేశం ఏర్పాటు చేసి మారి తెలిపారు. ఒకవైపు నిజమైన రైతులకు పరిహారం అందలేదని ఆయన తెలిపారు.

నేడు ముఖ్యమంత్రి పర్యటన సాగనుంది ఇలా..

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఉదయం ఎనిమిది గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరుతారు. ప్రత్యేక విమానంలో ఉదయం 9.15 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి హెలిక్యాప్టర్‌లో బయలుదేరి 9.50 గంటలకు కళ్యాణదుర్గం చేరుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి సభ జరిగే మోడల్ స్కూల్ వద్దకు 10 గంటలకు చేరుకుంటారు. ఫొటో గ్యాలరీ పరిశీలన, అగ్రిల్యాబ్ ప్రారంభిస్తారు. 10.30 గంటలకు ఉచిత పంటలబీమా పంపిణీ సభ ప్రారంభం అవుతుంది. మధ్యాహ్నం 12.05 గంటలకు అక్కడి నుంచి తిరుగు పయనమవుతారు. కొంతసేపు జిల్లా నేతలతో సమావేశమైన తరువాత 12.55 గంటలకు అక్కడి నుంచి వెళ్లిపోతారు.

సభను విజయవంతం చేయండి : మంత్రి

రైతు దినోత్సవం సందర్భంగా శనివారం నాడు కళ్యాణదుర్గంలో నిర్వహిస్తున్న బహిరంగ సభ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని మంత్రి ఉషశ్రీచరణ్ కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హాజరై రైతుల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేస్తారన్నారు. కాగ కళ్యాణదుర్గం పట్టణం కంబదూరు రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్సీ శివరామరెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య గారు, కళ్యాణదుర్గం నియోజకవర్గం వైసిపి పరిశీలకుడు ఎంఆర్‌సి.రెడ్డితో కలిసి పరిశీలించారు. అక్కడి ఏర్పాట్లపై అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా సభను విజయవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కళ్యాణదుర్గంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. సభకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితోపాటు, జిల్లా మంత్రి ఉషచరణ్ శ్రీ, జిల్లా కలెక్టర్ గౌతమిలు పరిశీలించారు. పోలీసు భద్రతను కట్టుదిట్టం చేశారు. డిఐజి అప్పిరెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావు భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.



ముఖ్యమంత్రి బహిరంగ సభకు సంబంధించి కళ్యానదుర్గంలో జరుగుతున్న ఏర్పాట్లు

రైతాంగాన్ని మోసం చేసిన ప్రభుత్వం

నామమాత్రపు ఇన్‌పుట్ సబ్సిడీతో దగా
కలెక్టరేట్ వద్ద ధర్నాలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో పంటలు నష్టపోయిన రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా ఇవ్వకుండా వైసిపి ప్రభుత్వం మోసం చేసిందని టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతుకూ పూర్తి స్థాయి ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టిడిపి ఆధ్వర్యంలో శుక్రవారం నాడు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. గణేష్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు టిడిపి శ్రేణులు ర్యాలీగా చేపట్టాయి. అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి, మాజీ మంత్రులు పల్లె రఘునాథ్ రెడ్డి, పరిటాల సునీత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలో లేనప్పుడు జగన్‌రెడ్డి రైతాంగాన్ని ఆదుకుంటామని అనేక హామీలు ఇచ్చారన్నారు. అధికారం చేపట్టాక నాలుగేళ్లలో రైతులకు ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. కరువు జిల్లా అయిన సత్యసాయి జిల్లాలో 32 మండలాలు ఉంటే 14 మండలాలకు అరకొర వాతావరణ బీమా మంజూరు కాగ, మిగతా 18 మండలాల రైతులకు మొండి చేయి చూపించారన్నారు. ఉద్యానవన పంటలకు కూడా బీమా ఇవ్వలేదన్నారు. ఎకరాకు 20 వేలు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. గతంలో అసెంబ్లీ ఉమ్మడి జిల్లాకు రావాల్సిన వేరుశనగ పంటలకు రూ.960 కోట్లు, ఉద్యానవన పంటలకు రూ.360 కోట్లు ఇస్తామని జగన్ హామీ ఇచ్చారన్నారు. నాలుగేళ్లు అవుతున్నా ఈ నష్టపరిహారం ఇవ్వడానికి జగన్‌కు చేతులు రావడం లేదన్నారు. టిడిపి హయాంలో బీమాతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందించామని గుర్తు చేశారు. రైతులను ఆదుకోకుండా ఏ ముఖం పెట్టుకుని జగన్మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా పర్యటనకు వస్తున్నారని చెప్పాలని నిలదీశారు. ఉమ్మడి జిల్లాల రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే అన్నదాతల ఆగ్రహానికి ఈ ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి సవితమ్మ, నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, సామకోటి ఆదినారాయణ, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సదస్సు కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-కదిరి టౌన్



కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీడీ కార్మికులు, సిఐటియు నాయకులు

బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ఈనెల 13వ తేదీన నెల్లూరులో జరిగే బీడీ కార్మికుల సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆంధ్రప్రదేశ్ బీడీ కార్మిక సంఘం నాయకులు శుక్రవారం కదిరి పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం పట్టణంలోని నిజాంవలీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి బీడీ కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం నాయకురాలు నూర్జహాన్, ఫాతిమా, అమ్మాజాన్, దిల్షాద్, సిఐటియు నాయకులు జగన్మోహన్, బాబ్జాన్, రామ్మోహన్, ఫైరోజ్, ఫాజిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీడీ కార్మికులుకు యజమానులు సక్రమంగా జీతాలు ఇవ్వడంలేదన్నారు. దినసరి కూలీలుగా పని చేస్తున్నవీరిని ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదన్నారు. బీడీ కార్మిక సంక్షేమ నిధి ఏర్పాటు చేసి పక్కా ఇల్లు, పెన్షన్ లాంటి పథకాలు అమలు చేయాలన్నారు. కదిరిలో బీడీ కార్మికుల కోసం ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బీడీ కార్మికుల సమస్యలపై చర్చించడానికి నెల్లూరులో జరుగుతున్న సదస్సును జయప్రదం చేయాలని వారు కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ మంజువాణి

పని చేయమంటే ఫిర్యాదు చేస్తారా..?

వైద్యం అందించకుండా గోలీలాటలా..!
వైద్యసిబ్బందిపై డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ ఫైర్

ప్రజాశక్తి-చిలమత్తూరు


సక్రమంగా విధులు నిర్వహించమంటే మండల వైద్యాధికారిపై ఫిర్యాదు చేయడం తగదని డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ మంజువాణి చిలమత్తూరు ప్రభుత్వ వైద్య సిబ్బందిని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఇటీవల మండల రెండవ మెడికల్ ఆఫీసర్‌గా ఉన్న మహిళా వైద్యురాలు ఫామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి వెళ్లిన తరుణంలో రోగులకు వైద్యసేవలు అందించకుండా గోలీల ఆట ఆడుతూ కాలక్షేపం చేస్తున్న వీడియో వైరల్ అవ్వడంతో ఆ విషయంపై శుక్రవారం నాడు విచారణ చేపట్టారు. ఈ విషయంపై విచారణ జరుగుతుండగా మండల వైద్యాధికారి రామకృష్ణ తమకు సెలవులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని సిబ్బంది డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒకు ఫిర్యాదు చేసే ప్రయత్నం చేశారు. దీంతో ఆయన తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. వెళ్లిన చోట గ్రామీణులకు వైద్యసేవలు అందించకుండా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించారని తాను విచారణకు వస్తే దానికి సమాధానం ఇవ్వకుండా వైద్యాధికారి వేధిస్తున్నాడని ఫిర్యాదు చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఫ్యామిలీ ఫిజీషియన్‌కు వెళ్లి అక్కడ గ్రామంలో గోలీలు ఆట ఆడడం ఏమిటని ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా విధులను నిర్వహించిన రెండవ మెడికల్ ఆఫీసర్, 104 సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఆమె విలేకరులకు తెలియజేశారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠినంగా ఉంటామని హెచ్చరించారు. కాగ చిలమత్తూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ విధి నిర్వహణలో నిఖచ్చిగా వ్యవహరిస్తుండడంతో కొందరు కింది స్థాయి సిబ్బంది కావాలనే ఆయనపై ఆరోపణలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

కోడూరు ఎంఎల్‌హెచ్‌పి ఆత్మహత్యాయత్నం

చిలమత్తూరు: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యసేవలందించాల్సిన వైద్యురాలు గోలీలు ఆట ఆడుతున్న వీడియో వైద్య సిబ్బంది గ్రూపులో వైరల్‌గా మారింది. దీంతో డిఎంహెచ్‌ఒ ఆదేశాల మేరకు డిప్యూటీ డిఎంహెచ్‌ఒ మంజు వాణి శుక్రవారం విచారణ చేపట్టారు. అనంతరం ఆ వీడియో తీసింది కోడూరు ఎంఎల్‌హెచ్‌పనే అంటూ చిలమత్తూరు రెండవ డాక్టర్ (గోలీల ఆట ఆడుతూ వీడియోలో చిక్కిన డాక్టర్)తో పాటు ఇద్దరు సిబ్బంది తనను వేధింపులకు గురి చేశారని బాధ పడుతూ ఈ విషయాన్ని తోటి సిబ్బందికి తెలుపుతూ మిస్ యూ అంటూ మెసేజ్ చేసింది. అనంతరం నిద్రమాత్రలు మింగింది. సెల్‌ఫోన్లో మెసేజ్ చూసిన తోటి సిబ్బంది, మిత్రులు వెంటనే కొడికొండ చెక్‌పోస్ట్‌లో ఉన్న ఆమె ఇంటి వద్దకు వెళ్లగా అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న ఎంఎల్‌హెచ్‌పిని చిలమత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యాధికారి సొంత వాహనంలో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

రెండురోజులుగా తెరచుకోని జిఎన్.పాలెం పాఠశాల

ప్రజాశక్తి-మడకశిర



మూతపడ్డ పాఠశాలకు అతికించిన బోర్డు

విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో విద్యా ప్రమాణాలు రోజురోజుకూ దిగజారిపోతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయులు వేళకు పాఠశాలకు రాకున్నా, రోజుల తరబడి పాఠశాలలు మూతపడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. విధి లేని పరిస్థితుల్లో తల్లిదండ్రులు పిల్లలను ప్రయివేటు పాఠశాలలకు పంపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రొళ్ల మండల పరిధిలోని గిరినాయకపాల్యం పాఠశాల మూతపడి రెండు రోజులు కావస్తున్నా సంబంధిత అధికారి పట్టించుకోక పోవడం శోచనీయం. 6వ తేదీ పనుల నిమిత్తం కార్యాలయాలకు వెళ్తున్నామని పాఠశాల గోడకు ఓ కాగితం తగిలించిన ఉపాధ్యాయులు 7వ తేదీ కూడా పాఠశాలకు హాజరుకాకపోవడం గమనార్హం. మండల వ్యాప్తంగా ఇదే పద్ధతి కొనసాగుతున్నా సంబంధిత పర్యవేక్షణ అధికారి పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు నాడు-నేడు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారయ్యాయి. ఏ ఒక్క పాఠశాల లో కూడా నాడు-నేడు పనులు పూర్తి చేయలేదు. చేసిన పనులు కూడా నాసిరకంగా ఉండటంతో ఏ సమయా నికి ఏమి జరుగుతుందోనని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై రొళ్ల ఎంఇఒ శ్రీధర్‌ను వివరణ కోరగా శుక్రవారం ఎంఆర్సీ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని ఆ కార్యక్రమానికి ఉపాధ్యాయులు హాజరయ్యారని అనుకున్నామని, అయితే జిఎన్ పాలెం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులు చనిపోయారని తెలిపారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-గాండ్లపెంట



ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

ప్రజల సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని కదిరి ఎమ్మెల్యే డా॥పివి.సిద్ధారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు అందించేందుకు వాలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేస్తున్నారని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారులకూ 11 రకాల సేవలను ఉచితంగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాదవేంద్ర, ఇఒఆర్‌డి సునీత, ఎంపీపీ టి.జగన్మోహన్, వైసీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి. జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి. రవీంద్రారెడ్డితో పాటు సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగన్న సురక్ష పథకం కార్యక్రమాన్ని కదిరి మండల పరిధిలోని కదిరికుంట్లపల్లిలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కదిరి మండల పరిషత్ అధ్యక్షులు తోట అమర్నాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులకు ప్రభుత్వ పథకాలను అందించేందుకు జగనన్న సురక్ష పథకంను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు మాట్లాడుతూ పిఎం కిసాన్, రైతు భరోసా ఇతర సంక్షేమ పథకాల కోసం తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ఇకెవైసి చేయించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కదిరికుంట్లపల్లి సర్పంచి రజనీష్ కుమార్ రెడ్డి, చలమకుంట్లపల్లి సర్పంచి నారపరెడ్డి, ఎంపీడీవో అంజనప్ప, మండల పరిపాలన అధికారి వెంకటనారాయణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


యూజర్ ఛార్జీల వసూలు తప్పనిసరి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం వ్యాప్తంగా ఇంటింటి చెత్త సేకరణకు సంబంధించి యూజర్స్ ఛార్జీలను తప్పని సరిగా వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ శానిటేషన్ సెక్రెటరీలను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ తన ఛాంబర్‌లో యూజర్ ఛార్జీల వసూలు, పారిశుధ్యం మెరుగుపై శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతు పురపాలక సంఘం వ్యాప్తంగా 22 వాహనాల్లో ఇంటింటి చెత్త సేకరణ జరుగుతోందన్నారు. దీనికి సంబంధించి యూజర్ ఛార్జీలు పూర్తి స్థాయిలో వసూలు చేయాలన్నారు. ఇందుకోసం మోప్మా సిబ్బంది, అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, దోమల నియంత్రణ కోసం రోజు మార్చి రోజు వార్డుల్లో ఫాగింగ్ చేయించాలన్నారు.

రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

పురపాలక సంఘం వ్యాప్తంగా చేపడుతున్న రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ సెక్రటరీలు, విఆర్‌ఒలను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో సచివాలయ అడ్మిన్, ప్లానింగ్ సెక్రటరీలు, విఆర్‌ఒలు, సుపర్ వైజర్లతో రీ సర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 16ఎ, నేచర్ ఆఫ్ ల్యాండ్, వర్గీకరణ పనిని వెంటనే పూర్తి చేయాలని వారికి సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ప్రమోద్ కుమార్

ప్రకృతిని కాపాడుకుందాం

హిందూపురం : విరివిగా మొక్కలను పెంచి ప్రకృతిని కాపాడుకొందామని నారాయణ పాఠశాల విద్యార్థులు పిలుపునిచ్చారు. శుక్రవారం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలను పెంచుదాం... పర్యావరణాన్ని కాపాడుదాం అన్న నినాదంతో పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ గంగప్ప, పట్టణ సిఐ ఈరన్న, వైద్యులు ఆప్తాబ్,ప్రిన్సిపల్ శివకుమార్, ఎఒ ముత్యాలన్న, వైస్ ప్రిన్సిపల్ శిల్పా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమగట్టలో జగనన్న సురక్ష

చిలమత్తూరు : సోమగట్టలో సర్పంచి రత్నమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిపి పురుషోత్తం రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు వివిధ ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామ్‌కుమార్, తహశీల్దార్ నాగరాజు పాల్గొన్నారు.

పార్టీ గెలుపు కోసం ఐక్యంగా ముందుకు వెళ్దాం

ఆత్మీయ సమావేశంలో వేణురెడ్డి పిలుపు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజక వర్గంలో వచ్చే ఎన్నికల్లో వైసిపి జెండా ఎగరాలంటే అందరూ కలిసి ఐక్యంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని వైసిపి నియోజక వర్గ సమన్వయ కర్త దీపిక భర్త వేణు రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో రూరల్ మండల నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో హిందూపురం నియోజకవర్గంలో ఉన్న విభేదాలు, గ్రూపులను పక్కనపెట్టి రానున్న ఎన్నికల్లో వైఎస్.జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. హిందూపురంలో 2024లో వైసీపీ జెండా ఎగరవేయడానికి ప్రతి ఒక్క వైసీపీ కుటుంబ సభ్యుడు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో వైసిపి రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంత రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకుడు నక్కలపల్లి శ్రీరామ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేసి వచ్చే ఎన్నికల్లో హిందూపురంలో వైసిపి జెండా ఎగురవేసేలా కృషి చేయాలని ఎంపిపి పురుషోత్తమరెడ్డి పేర్కొన్నారు. చిలమత్తూరు మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో శుక్రవారం నాడు మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో హిందూపురం నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి దీపిక భర్త వేణురెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఇకపై గ్రూపు రాజకీయాలను పక్కనబెట్టి అందరూ ఒకతాటిపై నడుద్దామన్నారు. వైసిపి అదిష్టానం నిర్ణయించిన వ్యక్తి గెలుపుకోసం ప్రతి ఒక్కరు కషి చేయాలన్నారు. ఈ ఆదివారం దీపిక చిలమత్తూరుకు రానున్న నేపథ్యంలో ఆమెకు వైసిపి శ్రేణులు ఘనస్వాగతం పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సమన్వయ కర్త దీపిక భర్త వేణురెడ్డి, సర్పంచి సంధ్య, తిరుమలేష్, మురళీ, లక్ష్మిపతిరెడ్డి, ఎంపిటిసిలు మంజునాథ్ రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేణు రెడ్డి

దాడికి నిరసనగా చేనేత షాపులు బంద్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

విజయవాడలో ధర్మవరం పట్టు చీరల వ్యాపారులు కోటం ఆనంద్, గిర్రాజు శశిలపై దాడికి నిరసనగా పట్టణంలో వారం రోజుల పాటు పట్టు చీరల షాపులను బంద్ చేస్తున్నట్లు పట్టు చీరల వ్యాపారుల సంఘం నాయకులు గడ్డం శ్రీనివాసులు, దాసరి లక్ష్మీనారాయణ, గిర్రాజు రవి, గిర్రాజు నగేష్ తెలిపారు. వారు శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి ఇంటికి బాధితులు కోటం ఆనంద్, గిర్రాజు శశితో పాటు వెళ్లి దాడి గురించి వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే న్యాయం జరిగేలా కృషి చేస్తానని బాధితులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టు చీరల వ్యాపారుల సంఘం నాయకులు నీలూరి ప్రకాష్, జివి ప్రసాద్, కోటం రవి, సిద్ది రాజేష్, కాచర్ల అంజి, జయరాంరెడ్డి, ఓంకార్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

చేనేతల జోలికొస్తే ఊరుకోం : పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరంలో చేనేత కార్మికుల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ హెచ్చరించారు. విజయవాడలో ధర్మవరం వస్త్ర వ్యాపారుల దాడి ఘటనపై పరిటాల శ్రీరామ్ అమెరికా నుంచి ఫోన్ ద్వారా స్పందించారు. వ్యాపారులు నమ్మి రూ. లక్షలు విలువ చేసే పట్టుచీరలు అప్పుగా ఇస్తే దాడులు చేయడం ఏంటని మండిపడ్డారు. దాడికి పాల్పడిన అవినాశ్ వైసిపి నేతగా చెబుతున్నారని, ఆయన ఏ పార్టీ వాడైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

దుర్గమ్మకు బోనాలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని ఆర్వేటి కటిక కులస్థులు, మహిళలు శుక్రవారం పెద్దమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్వేటి కటిక సంఘం అధ్యక్షుడు కెహెచ్ ప్రకాశ్, ఉపాధ్యక్షుడు సాయినాథరావు, సభ్యులు బాబిరావు, రమేష్‌బాబు, భరత్ ఆధ్వర్యంలో మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా డప్పు వాయిద్యాల మధ్య పెద్దమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు.

వైసిపి ఎంపిటిసి మృతి



కదిరి అర్బన్ : మండల పరిధిలోని కదిరి బ్రాహ్మణపల్లి వైసిపి ఎంపిటిసి సభ్యురాలు అంజనా దేవి శుక్రవారం మృతిచెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బెంగళూరు లోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె ప్రజలకు అందుబాటులో ఉండి పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారని గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి, ఎస్ఎండి ఇస్మాయిల్, సిఇసి సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, వైసిపి నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, వజ్ర భాస్కర్‌రెడ్డి, తదితరులు ఆ గ్రామం వెళ్లి ఎంపిటిసి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఆమె భర్త వైసిపి నాయకుడు మధుకర్ రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సెప్టెంబర్ 15లోగా భవనాలను పూర్తి చేయాలి

కలెక్టర్ అరుణ్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను సెప్టెంబర్ 15వ తేదీ లోగా పూర్తి చేయాలని, నిర్లక్ష్యం చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని అధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు, తదితర భవనాలను సంబంధిత అధికారులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే భవన నిర్మాణాలపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు అలసత్వం వీడి వేగవంతంగా పనిచేసే భవనాలను పూర్తి చేయాల న్నారు. సెప్టెంబర్ 15లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. కేటాయించిన లక్ష్యాలను ఎప్పటి కప్పుడు కచ్చితంగా చేరుకోవాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లతో ఆయా మండలాల అధికారులు మాట్లాడి పనులు వేగవంతంగా చేయాలని అవసరమైతే మరో ఏజెన్సీ తో మాట్లాడి పనులు చేపట్టాలన్నారు. మళ్లీ సమావేశం నిర్వహించే నాటికి భవన నిర్మాణాల్లో పురోగతి ఉండాలన్నారు. సమావేశంలో పిఆర్ఎస్ఈ గోపాల్ రెడ్డి, ఈఈ మురళీమోహన్, డిఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, డ్వామా పిడి రామాంజనేయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట



కెజిబివిలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-బత్తలపల్లి

ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేసిందని ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. మండల పరిధిలోని సంజీవపురం వద్ద ఉన్న కెజిబివిని శుక్రవారం ఎంపిపి బగ్గిరి త్రివేణిరెడ్డి, జడ్పిటిసి కోటి సుధ, సర్పంచి కమతం వరలక్ష్మి, తహశీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపిడిఓ సౌజన్యకుమారి సందర్శించారు. ఈ సందర్భంగా వారు వంట గదిని పరిశీలించి ఆహార పదార్థాలను భుజించారు. అలాగే తరగతి గదులకు వెళ్లి విద్యార్థులు సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాలలకు వచ్చే విద్యార్థులను సొంత పిల్లలుగా భావించి నాణ్యమైన భోజనం, మంచి విద్యాబుద్ధులు నేర్పించాలని ఉపాధ్యాయులు, భోజన నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని సూచించారు. పాఠశాలకు ఆట స్థలం, ప్రహరీకి ప్రధాన గేటును ఏర్పాటు చేయించాలని సిబ్బంది విజ్ఞప్తి చేశారు. వారి వెంట గుర్రం వనజ, గుర్రం శ్రీనివాసరెడ్డి, కమతం ఈశ్వరయ్య, తదితరులు ఉన్నారు.

సుబ్రమణ్యంకు న్యాయవాదుల సన్మానం



సమావేశంలో మాట్లాడుతున్న డి.సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి -పెనుకొండ

ఎపి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (జ్యూడిషల్) మెంబర్ డి.సుబ్రహ్మణ్యంకు శుక్రవారం సాయంత్రం పెనుకొండ న్యాయవాదులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో ఆయన సీనియర్ సివిల్ జడ్జి శంకరరావుతో కలిసి కోర్టు ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల విశ్రాంతి భవనంలో న్యాయవాదులతో కలిసి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆయన పెనుకొండకు వచ్చారు. పెనుకొండ న్యాయవాదులతో కలిసి తేనీటి విందు స్వీకరించారు. సీనియర్ న్యాయవాదులతో కాసేపు పెనుకొండ న్యాయస్థానంపై ముచ్చటించారు. అనంతరం ఎజిపి ఎం.భాస్కర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, న్యాయవాదులు సుదర్శన్‌రెడ్డి శాలవాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు చంద్రశేఖర్‌రెడ్డి, మలిరెడ్డి, అబూబకర్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసులు, శ్రీరాములు, శర్మ, నాగిరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

'పురం' నుంచి వైఎస్ కుటుంబ సభ్యులు పోటీ చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నరేష్

ప్రజాశక్తి-హిందూపురం

టిడిపికి కంచుకోటగా ఉన్న హిందూపురం నియోజక వర్గంలో వైసిపి జెండా ఎగరాలంటే వైఎస్ కుటుంబం తోనే సాధ్యమవుతుందని వైసిపి నేత వాల్మీకి నరేష్ కోరారు. హిందూ పురం నుంచి వైఎస్ కుటుంబ సభ్యులే పోటీ చేయాలని కోరుతూ శుక్రవారం నరేష్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పరిగి బస్టాండ్‌లోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, ప్రెస్ క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో నరేష్ మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి ఇక్కడ టిడిపి గెలుస్తుంది. దీనికి ప్రధాన కారణం ఇక్కడి గ్రూపు రాజకీయాలే అన్నారు. హిందూపురంలో వచ్చే ఎన్నికల్లో వైసిపి జెండా ఎగరాలంటే ఇక్కడ ఉన్న గ్రూపులన్నీ ఏకం కావాలని కోరారు. వైఎస్ జయంతి పురస్కరించుకుని అన్ని వార్డుల్లో పోస్టుకార్డు ఉద్యమం చేస్తామని అప్పటికీ వారు స్పందించకపోతే పురం నుంచి ఇడుపులపాయ వరకు పాదయాత్ర చేసి సమస్యను వివరిస్తామన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు వివరిస్తున్న డాక్టర్ భాస్కర్ నాయుడు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు తెలిపారు. మండల పరిధిలోని పెడబల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు పర్యావరణ విశిష్టతను వివరించారు. అలాగే మనిషికి, పర్యావరణానికి ఉన్న అవినా భావ సంబంధాలను విద్యార్థుల చేత చెప్పించారు. అడవులను కాపాడుకోవడంలో అధికారులు, ప్రజలు అలస త్వం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఒక్కొక్కరు వంద మొక్కలను పెంచుకుంటామని, అడవు ల్లో చెట్లను, జీవరాశులను కాపాడుకోవడంలో శ్రద్ధ చూపిస్తామని విద్యార్థుల చేత వాగ్దానం చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామచంద్రారెడ్డి, వ్యాయామ శిక్షకుడు సూర్యనారాయణ, చిన్న కృష్ణారెడ్డి, ఆదినారాయణ, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం ఆపాలని మహిళల ధర్నా



టవర్ నిర్మాణం పనుల వద్ద బైఠాయించిన మహిళలు

పెనుకొండ : పట్టణంలోని కోట లోపల ఉన్న జైన్ దేవాలయం ముందు చేపడుతున్న ఎయిర్‌టెల్ సెల్ టవర్ నిర్మాణం పనులను ఆపాలని స్థానిక మహిళలు ఆందోళన చేపట్టారు. వారికి సిపిఎం మండల కార్యదర్శి రమేష్, సభ్యులు గంగాధర్, వెంకట రాముడు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చుట్టుపక్కల ఇళ్లు, పాఠశాలలు, దేవా లయాలు ఉండడంతో నిత్యం చిన్నపిల్లలు, వృద్ధులు, ప్రజలు అధిక సంఖ్యలో వస్తుంటారన్నారు. ఇక్కడ సెల్ టవర్ ఏర్పాటు చేస్తే వచ్చే రేడియేషన్ కారణంగా ప్రజలు రోగాలు బారిన పడతారని, కావున టవర్ నిర్మాణాన్ని ఆపాలని, లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రమణమ్మ, వెంకటలక్ష్మి, లావణ్య, సుబ్బమ్మ, భాగ్యలక్ష్మి, మంగమ్మ పాల్గొన్నారు.

ఘనంగా చిన్నగంధం వేడుకలు

పెనుకొండ : పట్టణంలోని బాబయ్య స్వామి దర్గాలో శుక్రవారం తెల్లవారుజామున చిన్న బాబయ్య స్వామి గంధం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సందల్ మహల్ వద్ద బాబయ్య స్వామి దర్గా వంశపారంపర్య పీఠాధిపతి తాజ్ బాబా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గంధాన్ని శిరస్సుపై ఉంచుకొని ఫకీర్ల మేళతాళాల నడుమ దర్గాలోని చిన్న బాబయ్య స్వామి సమాధి వద్ద గంధను ఎక్కించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కాబోయే వంశపారంపర్య పీఠాధిపతి సలావుద్దీన్‌బాబా, మత గురువులు, ఫకీర్లు, భక్తులు, తాజ్ బాబా శిష్యులు, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే చొరవ

లేపాక్షి : గతంలో కురిసిన వర్షాలకు మండల పరిధిలోని బయన్నపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న కల్వర్టు తెగిపోయి రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే శుక్రవారం కల్వర్టు ఏర్పాటుకు అవసరమైన రింగులు, ఇతర సామగ్రిని పంపించాడు. కార్యక్రమంలో నాగలింగారెడ్డి, బిసి సెల్ అధ్యక్షుడు రవి, నాయకులు చిదంబరరెడ్డి, నాగరాజు, మంజునాథ, లక్ష్మన్న, శంకరరెడ్డి, వెంకటేష్, సోము, హరీష్ పాల్గొన్నారు.



రవిచంద్రారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులుగా రవి

పుట్టపర్తి రూరల్ : జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యునిగా రవిచంద్రారెడ్డిని ఎన్నుకున్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి సు బ్బారావు నుంచి నియామక పత్రం అందుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అగ్రి అడ్వైజరీ కమిటీ చైర్మన్ అవుటాల రమణారెడ్డి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవి చంద్రారెడ్డి మాట్లాడుతూ రైతులందరికీ న్యాయం చేస్తూ వైసిపి పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కొల్లాయి నాయక్, వెంకటరెడ్డి, కేశప్ప, నాగ మల్లారెడ్డి, కురుమల ఎంపిటిసి రామప్ప, రవి ప్రకాష్, హబీబుల్లా, గిరిజాపతి, సర్పంచి కుల్లాయప్ప, ప్రతాపరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

టిడిపి గాండ్ల కమిటీ కన్వీనర్ ఎంపిక

కొత్తచెరువు : పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి గాండ్ల సాధికార కమిటీ అధ్యక్షుడిగా లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన చిన్నంపల్లి శివకృష్ణను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి శాయ శక్తులా కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాయకులు బోయ రాజు, నాగేంద్రప్రసాద్, కొడగాని పల్లె శివ, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల తనిఖీ

ప్రజాశక్తి : మండల పరిధిలోని కాచికుంట గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను శుక్రవారం ఎంపిపి ఈరన్న తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మస్టర్‌లో పేర్లు చదివి ఎంతమంది హాజరయ్యారు, ఎంత మంది రాలేదు, రోజుకు ఎంత కూలి, వారానికి ఎంత వస్తుంది, రోజుకు ఎన్ని మీటర్లు తీస్తున్నారు, తదితర విషయాలతో పాటు కూలీల సమస్యలు తెలుసుకున్నారు. అలాగే ఎంతమంది జాబ్‌కార్డు చేయించుకున్నారు, దాన్ని వల్ల ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు బ్యాంక్ ఖాతాకు ఎన్‌పిసిఐ లింక్ అవలేదు, బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడి సమస్య ను పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ రామ్మూర్తి, దేవరాజు, మేట్‌లు ఉన్నారు.

ఉత్తమ కండక్టర్‌గా రంగనాథప్ప

కదిరి టౌన్ : కదిరి డిపోలో విధులు నిర్వహిస్తున్న రంగనాథప్ప ఉత్తమ కండక్టర్‌గా ఎపికయ్యారు. అనంతపురం రూట్‌లో ఎక్స్-ప్రెస్ బస్సు సర్వీసుల్లో కండక్టర్‌గా పని చేస్తున్న రంగనాథప్ప జూన్-23లో అత్యధిక టార్గెట్ కలెక్షన్ 110.04 శాతంతో రూ. 3,79,294 సాధించిన తొలి వ్యక్తిగా నిలిచాడు. జూన్‌లో ఒక్క రోజు కూడా సెలవు ఉపయోగించు కోకుండా డ్యూటీలు చేశారు. ఉత్తమ కండక్టర్ సర్వీసులకు రూ. 500 నగదు అవార్డును కదిరి డిపో మేనేజర్ బి.మైనుద్దీన్ అందజేశారు. అలాగే అతడిని అసిస్టెంట్ మేనేజర్లు హరిత, హరిమోహన్, రామక్రిష్ణ, ఎన్ఎంయు డిపో కార్యదర్శి బైరిశెట్టి, ఎన్‌వి రమణ, సురేంద్ర, నారాయణరెడ్డి, మధు, బాలరాజు అభినందించారు.

వైసిపి ప్రభుత్వానికి అంతిమ రోజులు

ధర్మవరం టౌన్ : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు ముతుకూరు బీబీ తెలిపారు. 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 34వ వార్డులో టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించి న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బీబీ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచకాలు, దాడులు, కబ్జాలతో ప్రజలు విసిగిపోయారన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, కుళ్లాయప్ప, ఖాజా, మోహన, గంగాధర్, ఇమ్రాన్, వసంతలక్ష్మి, జగ్గు, పురుషోత్తం పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ఫిల్టర్, ఫ్రిజ్ వితరణ

కదిరి టౌన్ : పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి సంబంధించిన శ్రీచలపతినాయుని వసతి గదులు(అమృతవల్లి సదన్)లో భక్తుల కోసం స్థానిక కెనరా బ్యాంకు వారు రూ. 1,41,600 విలువ చేసే మినరల్ వాటర్ ఫిల్టర్, ఫ్రిజ్‌ను శుక్రవారం అందజేశారు. బ్యాంకు అధికారులకు ఆలయ కమిటీ చైర్మన్ గోపాలక్రిష్ణ, కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరెడ్డి తీర్థ ప్రసాదాలు అందజేసి శేషవస్త్రములతో సన్మానించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు డివిజినల్ మేనేజర్ వైవి రాంప్రసాద్‌రెడ్డి, కదిరి బ్రాంచి మేనేజర్ సిఎన్ మధుసూదన్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న విద్యాకానుక'కు వేలిముద్రల ఇక్కట్లు

పుట్టపర్తి అర్బన్ : జగనన్న విద్యాకానుకకు వేలిముద్రలు పడక విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాద్రి తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలల్లో బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర వేసి బ్యాగులు, ఇతర సామగ్రి తీసుకోవాల్సిందన్నారు. అయితే పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల్లో వారం రోజులుగా బయోమెట్రిక్ పరికరాలు సరిగా పనిచేయకపోవడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కావున ఉన్నతాధికారులు బయోమెట్రిక్ మిషన్లు మార్చాలని కోరారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

లేపాక్షి : మండల పరిధిలోని కోడిపల్లి గ్రామానికి చెందిన నాగభూషణ కొన్ని నెలల క్రితం గుండె జబ్బుతో మృతిచెందాడు. అతడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆ కుటుంబానికి 1993-94లో చోళసము ద్రం హైస్కూల్‌లో పదో తరగతి చదువుకున్న నాగభూషణ స్నేహితులందరూ చేయి చేయి కలిపి రూ. 17,350 అందజేశారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



ఎస్పీ ఎదుట హాజరైన పోలీసులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కళ్యాణదుర్గం పర్యటన నేపథ్యంలో శుక్రవారం విమానాశ్రయం, చుట్టుపక్కల ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను ఎస్‌పి మాధవరెడ్డి పరిశీలించారు. అంతకుముందు ఆయన విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో భద్రతా విధులు నిర్వహించే సిబ్బందికి స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సిఎం పర్యటనలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పై అధికారుల ఆదేశాలను తూ.చ తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ఈ పర్యటన నేపథ్యంలో ముగ్గురు డిఎస్‌పిలు, 11 మంది సిఐలు, 19 మంది ఎస్ఐలు, 91మంది ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 135 మంది కానిస్టేబుళ్లు, 18 మహిళా కానిస్టేబుళ్లు, 62 మంది హోంగార్డులతో పాటు, ఎఆర్, స్పెషల్ పార్టీ సిబ్బంది భద్రతా విధుల్లో పాల్గొంటున్నారు.

'గోనుగుంట్ల' అభిమానుల సేవా కార్యక్రమాలు



కేకు కోస్తున్న గోనుగుంట్ల సూరి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక కదిరి గేట్ వద్ద ఉన్న చేనేత విగ్రహం ఎదుట కార్యకర్తలు, నాయకులు మధ్య భారీ కేకును కట్ చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే మాజీ కౌన్సిలర్ డి.రాజు ఆధ్వర్యంలో కేక్ కోసి, అనంతరం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. పట్టణంలోని కొత్తపేట అయ్యప్పస్వామి గుడి వద్ద గోనుగుంట్ల అభిమానులు కేకు కట్ చేశారు. 33వ వార్డు సూరి అభిమాని పొరాళ్ల రహీం ఆధ్వర్యంలో గోనుగుంట్ల సూర్యనారాయణను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో అభిమానులు డిష్ రాజు, చిగిచెర్ల అరవిందరెడ్డి, తుంపర్తి పరమేశ్, గొట్లూరు చంద్ర, బొడగల గిరిధర్, రాప్తాటి రాము, చిలకం సూర్యనారాయణరెడ్డి, అశ్వర్థనాయుడు, నబిరసూల్, పద్మావతమ్మ, మల్లేనిపల్లి రాజు, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలి : ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ఓబుళదేవరచెరువు : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరాలని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సూచించారు. "గడప గడపకూ మన ప్రభుత్వం" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన మండలంలోని కొండకమర్ల-1 సచివాలయం పరిధిలోని ఓబుళరెడ్డిపల్లి, గంగిరెడ్డిపల్లి, కొండకమర్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటిని సందర్శించి వారి సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో తుమ్మల షామీర్ బాషా, మండల కన్వీనర్ రాజు నాయుడు, పట్టణ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, సర్పంచి జగన్మోహన్‌చౌదరి, మండల కో ఆప్షన్ మెంబర్ నిస్సార్ అహమ్మద్, రామసుబ్బారెడంర్డ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మాదిగల మనోభావాలను దెబ్బతీస్తే సహించం

పుట్టపర్తి రూరల్ : దళితుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసినా, సామాజిక మాధ్యమాల్లో ఉంచినా సహించబోమని జిల్లా మాదిగ దండోరా నాయకులు హెచ్చరించారు. కులాన్ని అత్యంత నీచంగా మాట్లాడుతూ బహిరంగంగా బెదిరిస్తున్న వైసిపి అధికార ప్రతినిధి పంచ్ ప్రభాకర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అలాగే దళితుల మాన ప్రాణాలను కాపాడాలని కోరుతూ ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బేకరీ గంగాధర, ఎం.తిప్పన్న, నరసింహులు, సాయి రంగప్ప, వెంకటరాముడు, రామయ్య, వరదరాజులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల భూముల్లో ముళ్లపొదలు తొలగింపు



ముళ్లపొదలు తొలగిస్తున్న దృశ్యం

లేపాక్షి : స్థానిక సోమిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన రైతులు పంటలు సాగు చేసుకునేందుకు శుక్రవారం ఆర్డిటి ఆధ్వర్యంలో ఎస్సీ రైతుల పొలంలో ముళ్లపొదలు తొలగించడం, ఎత్తు తగ్గులను చదును చేయడం, తదితర పనులు చేశారు. ఒక రైతుకు 4 గంటల జెసిబి సాయం అందించారు. ఎస్సీ రైతులు ఇబ్బందులు పడకుండా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున, ఏటిఎల్ జయచంద్రారెడ్డి, సిఒ రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

ధర్మవరం టౌన్ : అంగన్వాడీ కార్యకర్తల సమస్యలపై సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ నెల 10, 11 తేదీల్లో కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, అయూబ్‌ఖాన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద మహాధర్నా గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానాలను నెరవేర్చాలన్నారు. అందులోభాగంగా వేతనాలు పెంచాలని, పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు సరస్వతి, చంద్రకళ, పోతక్క, నూర్జహాన్, నాగలక్ష్మీ, చింతమ్మ, సుజాత, గోవిందమ్మ పాల్గొన్నారు.

ఆర్‌టిసి డిపోల్లో సమస్యలు పరిష్కరించాలి

ధర్మవరం టౌన్ : శ్రీసత్యసాయి రీజియన్‌లోని 6 డిపోల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి ఎన్ఎంయుఎ గౌరవాధ్యక్షులు డోరా రాజారెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ గతంలో డిపిటిఓకు తెలిపినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి కడప జోన్ ఈడి అండ్ ఎపిఎస్ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డికి ఫోన్ ద్వారా సమస్యలను తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రీజియన్ ఛైర్మన్ ముత్యాలప్ప, డిపో అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రభాకర్, కె.మధుసూదన్, గ్యారేజీ అధ్యక్ష, కార్యదర్శులు కుమార్, హరికృష్ణ, డిపో నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ అభివృద్ధికి ఐక్యంగా పోరాడాలి

ధర్మవరం టౌన్ : ఎమ్మార్పీఎస్ అభివృద్ధికి ఐక్యంగా పోరాడితేనే విజయం చేకూరుతుందని ఎమ్మార్పీఎస్ నాయకులు భూదెప్ప, రామాంజనేయులు, శివప్రసాద్ తెలిపారు. ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ నగర్‌లోని ఐసిఐసి బ్యాంక్ వద్ద జెండాను ఆవిష్కరించి, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. మాల, మాదిగ కులస్తులు ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేకపోతున్నారని, డాక్టర్ అంబేద్కర్ ఆశయ సాధనాలను అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూనే ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో గంగాధర్, నారాయణ, నరసింహా, వరప్రసాద్, పవన్‌కుమార్, పెద్దన్న, కమ్మరాజు, అంజి పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం గ్రామాలకు బస్సులు

హిందూపురం : మండల పరిధిలోని మలగూరు గ్రామం నుంచి పట్టణానికి బస్సు సౌకర్యాం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బస్సు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. దీని ఫలితంగా ఆర్‌టిసి అధికారులు శుక్రవారం నుంచి హిందూపురం-మలగూరు గ్రామానికి, హిందూపురం నుంచి శ్రీరంగరాజుపల్లి, చిలమత్తూరు, మడకశిర, పరిగి, లేపాక్షి, రొద్దం, పెనుగొండ ప్రాంతాలకు విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి మాట్లాడుతూ ఆయా గ్రామాలకు విద్యార్థులకు అనుగుణంగా బస్సులను నడపాలన్నారు. దీంతో పాటు గత సంవత్సరం నడిపిన బస్సులను తిరిగి పున: ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఎస్ఎఫ్ఐ నాయకులు హర్ష కుమార్, చంద్రశేఖర్, భగత్, మహేష్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.


రేషన్ బియ్యం పట్టివేత

సోమందేపల్లి : స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో శుక్రవారం ఎస్ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పెద్ద మొత్తంలో రేషన్ బియ్యాన్ని పట్టుకు న్నారు. గోవిందప్ప అనే వ్యక్తి ఈచర్ వాహనంలో ధర్మవరం నుంచి బెంగళూరు లోని బంగారుపేటకు 125 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తుండగా స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై పోలీసులు పట్టుకున్నారు. తహశీల్దార్ సురేష్‌కుమార్, సిఎస్‌డిటి గిరిధర్ ఆధ్వర్యంలో బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బియ్యం పట్టుకున్న వారిలో ఏఎస్ఐ మురళి, హెడ్ కానిస్టేబుల్ ఆది, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో గుత్తేదారులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పనులను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలని అధికారులకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ సూచించారు. శుక్రవారం 32వ వార్డు అహ్మద్ నగర్‌లో రూ.22లక్షల సాధారణ నిధులతో రిటైనింగ్ వాల్, మరో రూ.22 లక్షల సాధరణ నిధులతో పాటు రూ.22లక్షల గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో చేపడుతున్న రోడ్ల పనులను అధికారులతో కలిసి ఛైర్‌పర్సన్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరగ పూర్తి చేయాలని గుత్తేదారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రేష్మా బాబు, డిఈఈ వెంకట రమణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

మందకృష్ణకు పెద్దిరెడ్డి క్షమాపణ చెప్పాలి

శింగనమల : మందకృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఓబులేసు మాట్లాడుతూ మందవృష్ణ మాదిగ తెలంగాణ నాయకుడు ఆంధ్రాలోకి ఎలా వస్తాడని దుర్భాషలాడటం బాధాకరమన్నారు. వెంటనే పెద్దిరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు నార్పల పుల్లప్ప, బండారు కదిరప్ప, బుక్కరాయసముద్రం బండారు శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు



కరెంట్‌లైన్ కింద ఉన్న చెట్లను తొలగిస్తున్న దృశ్యం

ఉరవకొండ : తెగిపోయిన విద్యుత్ లైన్లకు వెలుగొండ, బుదగవి గ్రామాల సర్పంచులు వీరాంజనేయులు, ధనుంజయ శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. గత నాలుగు రోజులు నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో వెలిగొండ, బూదగవి గ్రామాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమస్యను గుర్తించిన ఆయా గ్రామాల సర్పంచులు విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి బూదగవి గ్రామ సమీపంలో చెరువు దగ్గర త్రీఫేస్ విద్యుత్ లైన్ కంప చెట్ల నడుమ పడిపోయిన విద్యుత్ తీగలకు మరమ్మతులు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నాగప్పతో పాటు రైతులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం అందజేత

తాడిపత్రి రూరల్ : రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లి -1 సచివాలయ పరిధిలో మృతిచెందిన బూసా బాల ఓబులేసు అంత్యక్రియలకు తక్షణ సాయం కింద వైఎస్ఆర్ బీమా పథకం కింద రూ.10 వేల నగదును సచివాలయ సిబ్బందితో కలిసి ఎంపీటీసీ రవికుమార్ కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. బాల ఓబులేసు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సచివాలయ అధికారులు, నాయకులు తక్షణ సాయం కింద రూ.10వేలను కుటుంబ సభ్యులకు అందించారు.



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

రైతు సంక్షేమానికి పెద్దపీట

'జగనన్న సురక్ష'లో నాయకులు



అనంతపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

సిఎం జగన్ నాయకత్వంలో వైసిపి ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని శ్రీనగర్, శ్రీనివాస్‌నగర్, అంబేద్కర్ నగర్‌లలో 'జగనన్న సురక్ష' క్యాంపులు నిర్వహించారు. ఇందులో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలకు సంబంధించి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక నాలుగేళ్లుగా సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ముందుకెళ్తున్నామన్నారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి, ఇప్పుడు జగన్ రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. 2022 ఖరీఫ్‌కు సంబంధించి వివిధ పంటల బీమా కింద జిల్లాకు రూ.211.80 కోట్లు మంజూరైనట్లు వివరించారు. రాజకీయంగా తామూ ఉన్నామని చెప్పుకోవడానికి మాత్రమే టిడిపి నాయకులు తాపత్రయం పడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ మహమ్మద్ వసీం, కమిషనర్ రమణారెడ్డి, సెక్రటరీ సంగం శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్పొరేటర్లు జయలలిత, లాలూ, లీలావతి, లావణ్య, కొండ్రెడ్డి రాధా, అనిల్‌కుమార్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైపుల్లా బేగ్, నరేంద్రనాథ్‌రెడ్డి, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు సాకే కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని నార్పల-4తోపాటు కేశేపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహా మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, వీఆర్వోలు సుకన్య, నాగరాజు వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉషారాణి, రాజశేఖర్, సచివాలయ సిబ్బంది సాయి శారద, లక్ష్మీనారాయణ, జయమ్మ, వినయ్, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన పాలన అందిచేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జెడ్పిటిసి హనుమంతు, తహాశీల్దార్ ఈరమ్మ తెలిపారు. శుక్రవారం విడపనకల్ మండలం గడేకల్ గ్రామ సచివాలయం-1లో సర్పంచి సుశీలా ఉమాశంకర్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల అవసరం మేరకు వారు కోరే 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బసన్న, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, ఇఒఆర్‌డి సత్యాబాబు, ఎంపిటిసి ఓబులేష్, ఉపసర్పంచి తిమ్మాపురం రాముడు, పంచాయతీ సెక్రటరీ సోమయ్య, ఆర్.కొట్టాల సర్పంచి జయసింహా, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, అంపయ్య, ప్రసాద్, చిన్న తిమ్మన్న, జయరాముడు, ఉమాశంకర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే సిఎం జగన్ లక్ష్యమని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం మండల పరిధిలో గుద్దేకుంట గ్రామంలో సర్పంచి రత్నమ్మ, కాలవపల్లిలో సర్పంచి పెద్దన్న అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గతంలో ఏ ఎన్నడూ లేనివిధంగా వాలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకే చేరుస్తున్నామన్నారు. ప్రస్తుతం చేపట్టిన సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా ప్రజల వద్దకే వెళ్లి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామచంద్ర, డిప్యూటీ తహశీల్దార్ వీరాసాబ్, హౌసింగ్ ఎఇ శివారెడ్డి సురేఖ, నాయకులు దుద్దేకుంట రామాంజనేయులు, హనుమంతరాయుడు, దేవనాథ్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి వెంకటేశులు, కాలవపల్లి మల్లారెడ్డి, సుధాకర్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : సిఎం జగన్ ప్రవేశపెట్టిన 'జగనన్న సురక్ష' ప్రజలకు రక్ష అని ఎంపిపి తోట అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కదిరికుంట్లపల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం సర్పంచి రజనీష్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపిపి మాట్లాడుతూ 'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు మాట్లాడుతూ పిఎం కిసాన్, రైతుభరోసా, ఇతర సంక్షేమ పథకాలకు అడ్డంకిగా ఉన్న ఈకెవైసి, ఆధార్ అప్‌డేట్ సేవలు ఉచితం గా పొందవచ్చన్నారు. ఎంపిడిఒ అంజనప్ప మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల వద్దకు వెళ్లి తీసుకోవాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో చలమకుంట్లపల్లి సర్పంచి నారపరెడ్డి, మండల పరిపాలన అధికారి వెంకటనారాయణ, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



ఉరవకొండ మండలం విడపనకల్లులో లబ్ధిదారుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

బత్తలపల్లి : ప్రజల వద్దకే వచ్చి పారదర్శకంగా సేవలందించడమే 'జగనన్న సురక్ష' ముఖ్య ఉద్దేశం అని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. మండల పరిధిలోని సంజీవపురం గ్రామ సచివాలయంలో సర్పంచి కమతం వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో డిఎల్‌డిఒ శివారెడ్డి, తహశీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపిడిఒ సౌజన్యకుమారి, ఎంపిపి బగ్గిరి త్రివేణిరెడ్డి, జడ్పిటిసి కోటి సుధ లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఈఒఆర్‌డి దివాకర్, సిఎస్‌డిటి శారద, వైసిపి నాయకులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి, గుర్రం వనజ, కమతం ఈశ్వరయ్య, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల పరిధిలోని జొన్నల కొత్తపల్లి, మర్తాడు గ్రామాల్లో నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగేంద్ర, ఈఓఆర్‌డి ఖాదర్‌బాషా, జడ్పిటిసి తిరుమల సేవా నాయక్, మల్లగుండ్ల భాస్కర్, యోగానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

కొత్తచెరువు : 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ శివరంగప్రసాద్ సూచించారు. మండల పరిధిలోని మైలుసముద్రం, కేసాపురం, నారేపల్లి గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన జగనన్న సురక్ష సభల్లో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ రామాంజనేయరెడ్డి, ఎంపిడిఒ సిద్ధారెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ స్వాతి, ఎఒ నటరాజు, మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, సర్పంచులు ఇందిరమ్మ, నరేందర్‌రెడ్డి, ప్రకాష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

ఫయాజ్ ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయం

తాడిపత్రి : ఫయాజ్ బాషా ట్రస్ట్ ఆధ్వర్యంలో తాడిపత్రి పట్టణానికి చెందిన కరీముల్లాకు రూ.10వేల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయాన్ని ట్రస్ట్ అధ్యక్షులు ఫయాజ్ బాషా మాట్లాడుతూ కరీముల్లా తల్లి అనారోగ్యంతో మరణించటం పట్ల వారి పేదరికాన్ని దృష్టిలో ఉంచుకుని తోడుగా తమ వంతు ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు.

ఘనంగా దండోరా ఆవిర్భావ దినోత్సవం

పెద్దపప్పూరు : దండోరా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండు వద్ద దండోరా జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా దండోరా నాయకులు మాట్లాడుతూ 1994 జులై 7న ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో 20 మంది యువకులతో దండోరా ప్రారంభమైందన్నారు. ఇప్పుడు అన్ని రాష్ట్రాల్లో దండోరా వ్యాపించిందన్నారు. 29 సంవత్సరాలు దండోరా ఉద్యమంలో ఎన్నో సాధించినట్లు వివరించారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ పథకం, వృద్ధులు, వితంతులు, వికలాంగుల పింఛన్లు వంటి సమస్యలను పరిష్కరించిన ఘనత మందకృష్ణ మాదిగకు చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు పెద్దిరాజు, సీనియర్ నాయకులు టి.ఆదినారాయణ, చింతా పురుషోత్తం, చేనేత కార్మిక సంఘం తాలూకా అధ్యక్షులు సిబి.రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర హాస్టల్‌లో వైఎస్ఆర్‌కు నివాళి



చిన్నారులతో కేక్ కోయిస్తున్న వైఎస్ఆర్ విద్యార్థి సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

దివంగత మహా నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని వైసిపి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి కేక్ కోసి పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి సహకారంతో నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి విభాగం నేతలు మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆశయ సాధనకు సిఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో విద్యను వ్యాపారంగా మార్చితే వైఎస్ జగన్ సీఎం అయ్యాక విద్యారంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. పేదలు విద్యకు దూరంగా కాకూడదన్న లక్ష్యంతో అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన పథకాలతో పాటు పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం కింద రుచికరమైన ఆహారం అందిస్తున్నారని తెలిపారు. మనబడి నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మారుస్తున్నారన్నారు. స్కూళ్లు తెరిచే సమయానికే విద్యాకానుక అందిస్తున్న పరిస్థితి నేడు ఉందన్నారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మతి హనుమంతురెడ్డి, నగర అధ్యక్షుడు మారుతీప్రకాష్, నాయకులు నవీన్, విజయ్, ఆసీఫ్, కైలాస్, నవాజ్, కార్తీక్, వసీం, చరణ్, ఆకాష్, అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.